క్లుప్తంగా

నేడు దశాబ్ది ఉత్సవాల సన్నాహక సమావేశం

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల సన్నాహక సమావేశం గురువారం మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం ఎంపీపీ ఎల్గనమోని రవీందర్ యాదవ్ అధ్యక్షతన నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు మండల కోఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు ఉదయం 10గంటలకు హాజరు కావాలని కోరారు.

నేడు కంటి వెలుగు శిబిరం

కొత్తూరు: మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో గురువారం కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్యయాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలని ఆమె సూచించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

షాద్‌నగర్: సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరంలాంటిదని షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. బుధవారం ఆయన బాధితులకు మంజూరైన చెక్కులను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నర్సింహ్మారెడ్డి, చెట్ల నర్సింహ్మా, లక్ష్మణ్ నాయక్, చేగూరి రాఘవేందర్‌గౌడ్, పిల్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఏజీపీకి ఘన సన్మానం



రాజగోపాల్‌ను సన్మానిస్తున్న జెడ్పీటీసీ విశాలరెడ్డి

షాద్‌నగర్‌రూరల్: అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ) కంచి రాజగోపాల్‌కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్, జెడ్పీటీసీ సభ్యురాలు విశాలరెడ్డి ఆయన్ను శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. న్యాయ విభాగంలో ఎంతో మంది పేదలకు ఉచిత సేవలందించిన రాజగోపాల్‌ను ఏజీపీగా నియమించడం హర్షనీయమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు.

పుస్తె, మెట్టెల అందజేత



పుస్తె, మెట్టెలు అందజేస్తున్న సర్పంచ్ పద్మ దంపతులు

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ మండలం కంసాన్‌పల్లి గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన బ్యాగరి అంజయ్య కుమారుడు చెన్నయ్య వివాహానికి సర్పంచ్ బసిరెడ్డి పద్మ, మాజీ వైస్ ఎంపీపీ నరేందర్‌రెడ్డి దంపతులు బుధవారం పుస్తె, మెట్టెలతో రూ.10వేల ఆర్థికసాయం అందించారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు నేడు శంకుస్థాపన చేయనున్నట్లు డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోరెడ్డి ధర్మారెడ్డి, పలుగుచెరువు మహేష్‌లు వెల్లడించారు. డివిజన్ పరిధిలోని రాజేంద్రనగర్ పత్తికుంట, బుద్వేల్, శివరాంపల్లి ప్రాంతాల్లో గురువారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారన్నారు. ఈ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

డైలీ పాస్ ఈ సర్వీస్‌లో నడవదా?

రాజేంద్రనగర్: ఆర్టీసీ అధికారులు జంట నగరాలలో 24 గంటల పాటు ప్రయాణించేందుకు ప్రవేశపెట్టిన 90 రూపాయల బస్‌పాస్ తమకు ఉపయోగపడడం లేదని రాజేంద్రనగర్, శంషాబాద్, గండిపేట మండలాల ప్రజలు వాపోతున్నారు. శంషాబాద్ నుంచి గచ్చిబౌలికి ఆర్టీసీ ప్రతి రోజు 315 నంబరు గల సర్వీసు బస్సును నడుపుతుంది. వ్యాపారస్తులు, ఉద్యోగులు, స్థానిక ప్రాంతాల ప్రజలు గచ్చిబౌలి, శంషాబాద్‌కు వెళ్లేందుకు ఈ సర్వీసు ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం ఆర్టీసీ 90 రూపాయల టికెట్ కొనుగోలు చేస్తే 24 గంటల పాటు జంట నగరాలలోని అన్ని బస్సుల్లో ప్రయాణించేలా రూపొందించింది. కానీ ఈ సర్వీసుకు ఈ పాసు నడవదని కండక్టర్లు తెలుపుతుండడంతో ప్రయాణికులు లబోదిబోమంటున్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ధూంధాంగా.. దశాబ్ది



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



చేవెళ్ల: ఆర్డీఓ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

- ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని వివరించాలి
- ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించే దశాబ్ది ఉత్సవాలను ధూం..ధాంగా నిర్వహించాలని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సూచించారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నియోజకవర్గంలోని అన్ని శాఖల మండల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అయితే తెలంగాణ ఆగం అవుతుందని ఎంతో మంది నేతలు అన్నారని అన్నారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ బంగారు తెలంగాణ రాష్ట్రంగా నిర్మిస్తున్నారన్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల గురించి దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రజలకు వివరించాలని సూచించారు. రైతు వేదికలను ముస్తాబు చేసి అన్నదాత కోసం ప్రభుత్వం చేపట్టిన పథకాల పై వివరించాలన్నారు. ఊరూరా చెరువుల పండుగను నిర్వహించాలని, సాగునీటి రంగంలో సాధించిన ప్రగతిని వివరించాలని చెప్పారు. అమరుల త్యాగాల ఫలితంగానే ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైందని వారి త్యాగాలను స్మరించుకోవాలన్నారు. ఉత్సవాల్లో ప్రజలను, ప్రజాప్రతినిధులను, ఉద్యోగులు అందరిని భాగస్వామ్యం చేయాలని అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చించోడ్, పీర్లగూడ, గంట్లవెల్లి గ్రామాల్లో ఈనెల 9న పేదలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా 17న షాద్‌నగర్‌లో బంజారా భవన్ నిర్మాణానికి శంకుస్థాపనకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, ఎంపీపీ ఖాజా ఇద్రీస్, ఎంపీడీఓలు వినయ్‌కుమార్, శరత్‌బాబు, కమిషనర్ వెంకన్న, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి, ఎంఈఓ శంకర్ రాథోడ్ వివిధ గ్రామాల సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

పండుగలా అవతరణ ఉత్సవాలు: ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: ఈ నెల 2 నుంచి నిర్వహించే రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పండుగలా నిర్వహించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ వేణుమాధవ్‌రావు ఆధ్వర్యంలో బుధవారం డివిజన్‌లోని నాలుగు మండలాలకు చెందిన అన్నిశాఖల అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఆర్డీఓ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో జూన్ 2 నుంచి జూన్ 22 వరకు దశాబ్ది ఉత్సవాలు నిర్వహించాలన్నారు. అన్ని శాఖల అధికారులు ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. శాఖల వారీగా కార్యక్రమాన్ని తీసుకుని వేడుకలను నిర్వహించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్, మొయినాబాద్ మండలాలకు చెందిన అన్నిశాఖలకు చెందిన రెవెన్యూ, పంచాయతీరాజ్, వ్యవసాయశాఖ, మహిళా సంఘాలు, ఉపాధి హామీ, ఆర్‌డబ్ల్యూఎస్, ఐసీడీఎస్ తదితర శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది ఈ సమావేశంలో పాల్గొన్నారు.

వైభవంగా ఉత్సవాలు నిర్వహిద్దాం

మొయినాబాద్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు జూన్ 2 నుంచి 22వ వరకు గ్రామాల్లో ఘనంగా నిర్వహిద్దామని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మంజుల అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాంతియువజన సంఘం మాజీ అధ్యక్షుడు మల్లేశ్, అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవి యాదవ్, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు కవిత తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావం పెంపొందించుకోవాలి

మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి



ప్రతాప్‌రెడ్డిని సన్మానిస్తున్న సర్పంచ్ మంజుల

కేశంపేట: ప్రతీ ఒక్కరు భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని మాజీ ఎమ్మెల్యే చొలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని వేములనర్వలో బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. బుధవారం ఉత్సవాలకు హాజరైన ప్రతాప్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులు మాజీ ఎమ్మెల్యే చొలపల్లి ప్రతాప్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మంజులయాదవ్, పర్వత్‌రెడ్డి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయికి నేతల పూజలు

కేశంపేట: ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఎంపీపీ ఎల్గనమోని రవీందర్ యాదవ్ అన్నారు. మండల పరిధిలోని కాకునూర్, వేములనర్వ గ్రామాల్లో నిర్వహిస్తున్న బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయా గ్రామాల్లో బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్త్రీ, శిశుసంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాలరెడ్డి, సర్పంచ్‌లు లక్ష్మమ్మ, మంజుల, నవీన్‌కుమార్, రాములు నాయక్, జగన్‌నాయక్, శ్రీశైలం గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ జగదీశ్వర్‌గౌడ్, మల్లేశ్‌యాదవ్, జమాల్‌ఖాన్, వేణుగోపాలాచారి, భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని నియంత్రించాలి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

- ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి
- పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్

చేవెళ్ల: ప్రైవేటు విద్యాసంస్థల ఫీజుల దోపిడీని నియంత్రించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్ డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం ఆయన ఆర్డీఓ వేణుమాధవ్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేశ్ మాట్లాడుతూ.. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే అడ్మిషన్లు చేస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేదంటే తమ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సంఘం డివిజన్ అధ్యక్షుడు జైపాల్, కార్యదర్శి శ్రీకాంత్ తదితరులున్నారు.

ఓటమి భయంతోనే నోరు జారుతున్నారు



విలేకరుల సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

- అవినీతి, అక్రమాలకు పాల్పడే మంత్రికి బీజేపీని విమర్శించే హక్కులేదు
- పార్టీ నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ విజయ్‌కుమార్

షాద్‌నగర్‌రూరల్: ఓటమి భయంతోనే బీఆర్‌ఎస్ మంత్రి నోరుజారి ఎవరు ఏం పీకలేరు అని మాట్లాడుతున్నాడని బీజేపీ నాయకులు విమర్శించారు. మంగళవారం నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ బీజేపీ పై చేసిన విమర్శలకు బుధవారం పార్టీ నేతలు స్పందించారు. పట్టణంలోని దేవి గ్రాండ్ హోటల్‌లో పార్టీ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి పనులకు కేంద్రం ఒక్క పైసా ఇవ్వడం లేదని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అవగాహన రాహిత్యంగా మాట్లాడుతున్నారని అన్నారు. పల్లె ప్రగతి, డంపింగ్ యార్డు నిర్మాణం, శ్మశాన వాటిక, రైతు వేదికవంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్రమే నిధులిస్తుందన్నారు. పంచాయతీల్లో సర్పంచ్‌లు చేసిన అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయక వారు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బీజేపీకి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకనే దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏదుల, ఉదండాపూర్, కరివెన రిజర్వాయర్ నిర్మాణాన్ని చేపట్టిన ప్రభుత్వం లక్ష్మీదేవిపల్లిని ఎందుకు నిర్లక్ష్యం చేస్తోందని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నేతలు శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, భూపాలచారి, అశోక్‌గౌడ్, శ్రీనివాస్, మురళి, రుషికేష్, వంశీ, మనోహర్‌రెడ్డి, మోహన్ సింగ్, లక్ష్మీకాంత్‌రెడ్డి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

సీఐ ప్రసన్న కుమార్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీఐ ప్రసన్న కుమార్

శంకర్‌పల్లి: క్రీడాకారులు గెలపోటములను సమానంగా స్వీకరించాలని శంకర్‌పల్లి సీఐ ప్రసన్న కుమార్, ఎంపీడీఓ వెంకయ్యగౌడ్ అన్నారు. మండల పరిధిలోని మోకిల గ్రామంలోని క్రీడా ప్రాంగణంలో నెల రోజులుగా నిర్వహించిన వాలీబాల్-2023 వేసవి క్రీడా శిబిరం ముగింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి మోకిల జట్టుకు రూ.12వేల నగదు, రెండవ బహుమతి కొండకల్ తండా రూ.8వేల నగదు, షీల్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఆశీర్వాదం, వార్డు సభ్యులు శేఖర్, విఠల్, ముత్రం తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న సర్కార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి శంకర్

షాద్‌నగర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి వీర్లపల్లి శంకర్ ఆరోపించారు. బుధవారం ఆయన పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం దళితులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మించి షాద్‌నగర్‌కు సాగునీటిని అందిస్తామని చెప్పిన కేసీఆర్ హామీ ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్ర ఏర్పాటు సమయంలో తెలంగాణ మిగులు బడ్జెట్‌లో ఉంటే ప్రస్తుతం సీఎం కేసీఆర్ అప్పుల తెలంగాణగా మార్చారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీకి వస్తున్న పునర్‌వైభాన్ని తట్టుకులేకే షాద్‌నగర్ సభలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఇష్టానుసారంగా మాట్లాడారన్నారు. కాంగ్రెస్‌కు 60 చోట్ల అభ్యర్థులే లేరన్న మంత్రికి టికెట్ వస్తుందో లేదో చూసుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో నాయకులు బాబర్‌ఖాన్, రఘు, తుపాకుల శేఖర్, వెంకట్‌రెడ్డి, సుదర్శన్, రాజశేఖర్, ముబారక్, రవీందర్‌గౌడ్, సీతారాం, మాణిక్యం, అశోక్, నర్సింహ, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

2వ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయండి

ఆందోళన చేపట్టిన కాంట్రాక్టు ఉద్యోగులు



కేశంపేట పీహెచ్‌ఎస్‌సీ ఎదుట ఆందోళన చేస్తున్న ఏఎన్‌ఎంలు

కేశంపేట: 2వ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేస్తామని రాష్ట్రం ఏర్పడిన తర్వాత తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్యశాఖకు చెందిన ప్రతీ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో 2వ ఏఎన్‌ఎంలే ముందు ఉండి పూర్తి చేస్తారన్నారు. ఎన్నో ఎళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగాలు చేస్తున్న తమను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు కోరితే.. జీతాలు చాలకపోతే ఉద్యోగాలను వదులుకోవాలని చెప్పడం సరికాదని మండిపడ్డారు. వెంటనే మంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 2వ ఏఎన్‌ఎంలను జీఓ 16లో చేర్చి తమకు జీతాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీణ, కృష్ణవేణి, సంతోష, వాణి, గున్నమ్మ, సుజాత, హేమలత, తిరుపతమ్మ, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం పదిలం



మేరీ లైఫ్ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, గర్భిణులు, బాలింతలు

సీడీపీఓ నాగమణి

కొత్తూరు: చిరుధాన్యాలతో కూడిన ఆహారం తీసుకుంటేనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఐసీడీఎస్ సీడీపో నాగమణి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మేరీ లైఫ్ కార్యాలయంలో భాగంగా గర్భిణులకు, బాలింతలకు ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు. తాజాగా ఉన్న పోషకాహారాలనే తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శరత్ చంద్రబాబు, తహసీల్దార్ రాములు, ఐసీడీఎస్ కొత్తూరు మండల సూపర్‌వైజర్ జ్యోతి పాల్గొన్నారు.

'కంటి వెలుగు' వినియోగించుకోవాలి



కంటివెలుగు కేంద్రంలో పరీక్ష చేయించుకుంటున్న నాయకులు

మణికొండ: కంటి వెలుగు కేంద్రాలను ప్రజలంతా ఉపయోగించుకోవాలని మణికొండ మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్ అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని 14వ వార్డులోని శివాజీనగర్ కాలనీ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కమ్యూనిటీహాల్‌లో కౌన్సిలర్ యాలాల లావణ్యనరేష్ ఆధ్వర్యంలో కంటి వెలుగు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చైర్మన్ నరేందర్ హాజరై కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి వెలుగు కేంద్రాలలో ఉచితంగా వైద్యం అందించడంతో పాటు కంటి అద్దాలను అందిస్తారన్నారు.ఈ కేంద్రం మే 31వ తేదీ నుంచి జూన్ 8వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు లావణ్యనరేష్, రామకృష్ణారెడ్డి, లక్ష్మినారాయణ, వసంతరావు, కోఆప్షన్ సభ్యులు తాజుద్దీన్, మాజీ సర్పంచ్ యాలాల నరేష్, సిద్ధప్ప, మెడికల్ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాంత్‌సింగ్‌కు సన్మానం



శ్రీకాంత్‌సింగ్‌ను సత్కరిస్తున్న నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణ బీజేపీ అధ్యక్షుడిగా నియమితులైన శ్రీకాంత్‌సింగ్‌ను బుధవారం బీజేపీ నాయకులు ఘనంగా సత్కరించారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శ్రీకాంత్‌సింగ్‌ను జాతీయ బీసీ కమిషన్ సభ్యుడు ఆచారి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కండె హరిప్రసాద్, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కల్వకుర్తి బీజేపీ కోకన్వీనర్ నర్సింహ, బీజేపీ రాష్ట్ర నాయకులు రాంరెడ్డి, నాయకులు పరమేశ్‌గౌడ్, ప్రశాంత్, చెన్నకేశవులు, నర్సింహా తదితరులు సత్కరించారు.

'వెంకటాపూర్ అభివృద్ధికి కృషి'

తలకొండపల్లి: అంతర్గత రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, వాటర్‌ట్యాంక్‌లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించి వెంకటాపూర్ అభివృద్ధికి కృషి చేస్తానని ఐక్యతా ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు వరప్రసాద్‌రెడ్డి అన్నారు. విద్య, వైద్యం, ఉపాధి, లక్ష్యంగా ఐక్యతా ఫౌండేషన్ ముందుకు వెళ్తుందన్నారు.బుధవారంమండల పరిధిలోని వెంకటాపూర్‌లో ఆయన పర్యటించారు.గ్రామంలోని ఎల్లమ్మ, హనుమాన్,పీర్లకొట్టం తదితర వాటిఅభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఫౌండేషన్ నిధుల చే స్వయం ఉపాధి పథకాలు చేపట్టి ముదిరాజ్ కుల సంఘాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

టీయూఎఫ్ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మహేశ్వర్‌రెడ్డి



చేవెళ్ల: దశాబ్ది ఉత్సవాల్లో ఉద్యమకారులను గౌరవించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం(టీయూఎఫ్) చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి యాలాల మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉద్యమ సమయంలో ఉద్యోగాలు, వ్యాపారాలు వదిలి పోరాడిన వారిన పరిస్థితి ప్రస్తుతం దారుణంగా ఉందన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి పదేళ్లవుతున్నా వారిని పట్టించుకునే వారే లేరన్నారు. శుక్రవారం నుంచి నిర్వమించే దశాబ్ది ఉత్సవాల్లో ఉద్యమకారులను గౌరవిస్తూ వారికి ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. నామినేటెడ్ పదవుల్లో వారికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

ఓటు బ్యాంకుగానే వాల్మీకి బోయలు

- తమను ఎస్టీ జాబితాలో చేర్చాలి
- వాల్మీకి బోయ మేధావుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ బాలకృష్ణ

కొందుర్గు: ఎన్ని ప్రభుత్వాలు మారిన వాల్మీకి బోయలు బ్రతుకులు మారండం లేదని.. తమను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నారని వాల్మీకి బోయ మేధావుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ బాలకృష్ణ అన్నారు. బుధవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం వనంపల్లి గ్రామంలో ఇంటింటికి వాల్మీకి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులవృత్తిలేని కులం వాల్మీకి బోయలకు ముడెకరాల భూమి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింలు, చంద్రయ్య, కృష్ణయ్య, యాదయ్య, రామచంద్రయ్య, ఆంజనేయులు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి



మండల విద్యాధికారి డి.రామిరెడ్డి

అత్తాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను మరింత పెంచేందుకు ప్రవేశపెట్టిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి డి.రామిరెడ్డి కోరారు. జూన్ 3వ తేదీ నుంచి 17వ తేదీ వరకు బడిబాటను వివిధ రూపాల్లో నిర్వహిస్తారని తెలిపారు. ఇందుకుగాను రాజేంద్రనగర్ పట్టణ, మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్థానికంగా ఉన్న స్వచ్ఛంద సంస్థల సభ్యులు, పాఠశాలల విద్యా కమిటి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లతో ప్రత్యేకంగా సమావేశం అవుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపునకు చర్యలు తీసుకుంటారన్నారు. పాఠశాలల అభివృద్ధిలో భాగంగా సామూహిక అక్షరాభ్యాసం ,బాలికల విద్యపై ప్రత్యేక శ్రద్ధ తదితర అంశాలను ప్రచారం చేయాలని తెలిపారు. బడిబాట కార్యక్రమంలో 7 గంటల నుంచి 11 గంటల వరకు నూతనంగా పాఠశాలల్లో చేరే విద్యార్థులను గుర్తించడంతో పాటు బడి బయట పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించడం పట్ల స్థానికంగా ఉన్న ఎస్ఎస్‌జీ, లోకల్ బాడీ కమిటీల సహకారాన్ని తీసుకోవాలని పేర్కొన్నారు.